

ఫాతిమామాత ఊరేగింపు

కాజీపేటలో కొనసాగుతోన్న ఫాతిమామాత ఉత్సవాల్లో భాగంగా ఫాతిమామాత స్వరూపంతో ఊరేగింపు నిర్వహించారు. - 8లో



ఎరుపెక్కుతున్న ఏనుమాముల

వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు రైతులు పెద్దఎత్తున మిర్చిని విక్రయానికి తీసుకొస్తున్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38°/24°

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి, వేడిగాలులు వీస్తాయి. రాత్రి ఆహ్లాకరంగా మారుతుంది.



న్యూస్‌రీల్

గ్రూప్‌-2లో 43వ ర్యాంక్



నల్ల అజయ్

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన నల్ల అజయ్ రాష్ట్రస్థాయిలో 43వ ర్యాంక్ సాధించాడు. 2018లో కానిస్టేబుల్‌గా, 2024లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన అజయ్ ప్రస్తుతం గ్రూప్‌-2లో స్టేట్ 43వ ర్యాంక్ సాధించాడు. అలాగే కాళేశ్వరం జోన్‌లో 7వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బంధువులు అజయ్‌ను అభినందించారు.

సరస్వతీ పుష్కరాలపై నేడు కలెక్టర్ సమీక్ష

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలపై గురువారం కలెక్టర్ రాహుల్‌శర్మ సమీక్ష నిర్వహించనున్నారు. బుధవారం హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అధ్యక్షతన కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాలపై సంబంధిత శాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష చేశారు. కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాలనే ఆమె ఆదేశాలతో ఆయన సమీక్ష చేపట్టనున్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది.


దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో నెల రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రెనింగ్ ప్రోగ్రామ్ ఇవ్వనున్నట్లు హైదరాబాద్‌లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న అభ్యర్థులు ఈనెల 15నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి బీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. పూర్తి సమాచారానికి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం లేదా ఫోన్ నంబర్ 040-29303130 ద్వారా సంప్రదించాలని కోరారు.

ఇంటర్న్‌షిప్‌కు..


భూపాలపల్లి రూరల్: మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇంటర్న్‌షిప్‌కు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 745 జిల్లాలు, 25 సెక్టార్లలో 1.25 లక్షల కంటే ఎక్కువ ఇంటర్న్‌షిప్స్‌కు అవకాశం ఉందని తెలిపారు. యువత సొంత రాష్ట్రంలో లేదా ఇతర రాష్ట్రంలోనైనా 5 ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 1800 116 090 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. భూపాలపల్లి జిల్లాకు 23 ఇంటర్న్‌షిప్స్ కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు 21-24 మధ్య వయస్సు కలిగి ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి 13, డిప్లొమో చేసిన వారికి 2, ఐటీఐ చేసిన 8 మందికి అవకాశం ఉందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5వేలు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



భూపాలపల్లి అర్బన్: భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ, సమగ్ర శిక్ష సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని భవిత కేంద్ర ఆవరణలో 99 మంది దివ్యాంగులకు రూ.9,88,200 విలువ గల వీల్ చైర్, ట్రై సైకిల్, చెవిటి మిషన్స్, రోలేటర్స్, టీఎల్ఎం కిట్స్, బ్రెయిలీ కిట్స్ అందజేశారు. కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఈ కార్యక్రమంలో సీఎంఓ సామల రమేష్, ఎంపీడీఓ నాగరాజు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ప్రియవర్మ, సర్వన్‌కుమార్, తుషార్, రతన్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

అటకెక్కిన టీ–ఫైబర్



జిల్లా వివరాలు..	రెవెన్యూ డివిజన్లు (భూపాలపల్లి, కాటారం)	మండలాలు	గ్రామపంచాయతీలు	రెవెన్యూ గ్రామాలు
	2	12	241	223

పల్లెల్లో ప్రజలకు ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన టీ–ఫైబర్ పథకం అటకెక్కింది. ఇప్పటివరకు ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి రాలేదు. దీంతో గ్రామ పంచాయతీల్లో ఈ–పాలన మరుగునపడింది. ఎనిమిదేళ్లు గడుస్తున్నా సేవలు అందుబాటులోకి రాలేదు.

- కాటారం

మధ్యలోనే నిలిచిన పథకం..

ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ–పాలన, ఇంటింటికి తక్కువ ధరకే ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం టీ–ఫైబర్ పేరిట ఇంటర్నెట్ విస్తరణకు పూనుకుంది. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులు, రైతువేదికలు, ఇతర ప్రజాసేవల సంస్థలకు అధిక వేగంతో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం అందించేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్లు నిర్మించే సమయంలో టీ–ఫైబర్ కేబుల్ వేశారు. టీ–ఫైబర్ పథకంలో భాగంగా నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలు మినహా పక్కా భవనాలు కలిగిన గ్రామపంచాయతీ కార్యాలయాల వద్దకు టీ–ఫైబర్ కేబుల్ వేశారు. కొన్ని కార్యాలయాల్లో పరికరాలను సైతం బిగించారు. టెక్నికల్ సిబ్బంది పంచాయతీలకు వచ్చి టెస్టింగ్ కూడా నిర్వహించగా తదనంతరం వాటిని పట్టించుకున్న నాథుడేలేడు. ప్రస్తుతం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ, విజేతల ప్రకటన ఇలా ప్రక్రియ అంతా ఇంటర్‌నెట్ ద్వారానే జరగాల్సి ఉంది. కానీ పంచాయతీల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది ఆన్‌లైన్ సేవల కోసం మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తుంది.

మరుగునపడిన ఈ-పాలన..

పంచాయతీ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు డిజిటల్ సేవలు అందించాలని గతంలో క్లస్టర్ల వారీగా ఆపరేటర్లను నియమించారు. కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. జిల్లాలో 241 గ్రామపంచాయతీలు ఉండగా సుమారు 24మంది ఆపరేటర్లు విధుల్లో ఉన్నారు. గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపు, ఆదాయ, వ్యయాలు, జీతభత్యాలు, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ, ఇంటి పన్ను తదితర సేవలను ప్రజలకు డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఏ గ్రామపంచాయతీలో కూడా ఈ పాలన పూర్తిస్థాయిలో అమల్లోకి రావడం లేదు. ఈ–ఆపరేటర్లు అంతా మండల పరిషత్ కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తుంది. పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్న వారికి కార్యదర్శులు చేతి రాత రశీదులను జారీ చేస్తున్నారు. టీ–ఫైబర్ సేవలు అందుబాటులోకి తెచ్చి గ్రామపంచాయతీల్లో ఈ–పాలన కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పక్క మండలానికి వెళ్లాల్సి వస్తోంది..



పలిమెల మండలం ఏర్పాటై తొమ్మిదేళ్లు అవుతుంది. ఇక్కడ గ్రామపంచాయతీల్లో ఈ–పాలన అందుబాటులోకి రాలేదు. గ్రామపంచాయతీ కార్యాలయానికి సంబంధించి ఏదైన ఆన్‌లైన్ పని ఉంటే మహదేవపూర్ మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. సమయం, రవాణా ఖర్చులు వృథా అవుతున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామపంచాయతీల్లో ఈ–పాలన అందుబాటులోకి తీసుకురావాలి.

- జనగామ మధుకర్, పలిమెల

పంచాయతీల్లో ఈ-పాలనపై నివేదించాం

గతంలో గ్రామపంచాయతీల్లో ఈ–పాలన అందుబాటులోకి తీసుకురావడం కోసం ఇంటర్నెట్ సౌకర్యం, సామగ్రి ఏర్పాటు చేశాం. ప్రక్రియ పూర్తికాకపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. ఇటీవల ఉన్నతాధికారులు గ్రామపంచాయతీల్లో కంప్యూటరీకరణపై నివేదిక కోరడంతో అందజేశాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

- నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి

భూ సేకరణ గ్రామసభ

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నూతన చెరువులకు నీరందించడానికి కాల్వల నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణపై బుధవారం చిద్నెపల్లి గ్రామంలో అధికారులు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. బొప్పారం, ప్రతాపగిరి, చిద్నెపల్లి, చింతకాని గ్రామాల రైతుల నుంచి సేకరించనున్న 32.38 ఎకరాల భూమికి సంబంధించిన నిర్వాసిత రైతుల పేరు, కోల్పోతున్న విస్తీర్ణం వివరాలను అధికారులు గ్రామసభలో చదవి వినిపించారు. తాము కోల్పోతున్న భూమి కంటే తక్కువ విస్తీర్ణం నమోదు చేశారని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, భూ సేకరణకు రైతులు సహకరించాలని అధికారులు కోరారు. ఈ గ్రామసభలో తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఈఈ యాదగిరి, ఎస్సై మ్యాక అభినవ్, ఎంపీఓ వీరస్వామి, భూ సేకరణ విభాగం, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

కాటారం: అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎలాంటి హాని కల్గకుండా చూసుకోవాలని కాటారం రేంజర్ స్వాతి, డిప్యూటి రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కాటారం మండలం చింతకానిలో బుధవారం గ్రామస్తులకు అడవుల సంరక్షణ, అగ్ని ప్రమాదాల నివారణ, పులి కదలికలపై అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అటవీ చట్టాలు, వన్య ప్రాణాలను వధిస్తే వర్తించే చట్టాలను వివరించారు. అడవులు విస్తారంగా ఉంటేనే సమయానికి వర్షాలు కురుస్తాయని పర్యావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. వేసవి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అడవుల్లో మంటలు అంటిస్తే కఠిన చర్యలు తప్పవని, మంటలు వ్యాపించడం గమనిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అడవుల్లో వంటలు చేయడం, పొగ తాగడం లాంటివి చేయొద్దని సూచించారు. ఉచ్చులు, కరెంట్ తీగలు లాంటివి అమర్చి వన్యప్రాణులను వధిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రిపూట అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో యామన్‌పల్లి డీఆర్ఓ సురేందర్‌నాయక్, ఎఫ్‌బీఓలు అశోక్, రాజేందర్, బేస్ క్యాంపు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 12కిలోల 756 గ్రాముల నరుకు స్వాధీనం

కాటారం: మారుమూల గ్రామాల్లో విక్రయించడానికి తీసుకొచ్చిన గంజాయితోపాటు విక్రయించే వ్యక్తిని మహాముత్తారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి, సీఐ నాగార్జునరావు వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రంలోని నలంద జిల్లా గౌరి గ్రామానికి చెందిన గణేశ్‌ఠాకూర్ మూడేళ్లుగా చెల్పూర్‌లోని ఓ రైస్‌మిల్లులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. జీతం సరిపోకపోవడంతో అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే దురాశతో విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకొచ్చి పలుచోట్ల ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం సాయంత్రం గణేశ్‌ఠాకూర్ మహాముత్తారం మండలం యామన్‌పల్లి సమీపంలో గల చెరువు వద్దకు గంజాయి విక్రయించడానికి వచ్చాడు. ముందస్తు సమాచారంతో మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్, పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకొని గణేశ్‌ఠాకూర్‌ను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 12 కిలోల 765 గ్రాముల గంజాయి స్వాధీనపర్చుకొని సీజ్ చేసినట్లు డీఎస్పీ, సీఐ తెలిపారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం గణేశ్‌ఠాకూర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు. కాగా, నిందితుడు గతంలో సైతం గంజాయి విక్రయిస్తూ ఘన్‌పూర్ పోలీసులకు పట్టుబడగా జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. గంజాయి రవాణా చేసినా.. విక్రయించినా.. సేవించినా.. కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్, సీసీఎస్ ఎస్సై భాస్కర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

నారసింహుడికి సింహ వాహనసేవ

కోటంచలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం నాలుగో రోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్య విధి పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి సింహ వాహన సేవలో మాడ వీధుల గుండా ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాల చప్పుళ్లతో ఊరేగించారు. బలిహరణం అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం, సదస్యం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అరగింపు, తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఆలయ మహేష్, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, ఆకుల రమేష్, మూల ఓంకార్, కనుకుంట్ల జోగేందర్, గ్రామ పెద్దలు కనుకుంట్ల దేవేందర్, ఆలయ సిబ్బంది రవీందర్, శ్రావణ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.



సింహవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

నేడు హనుమంత వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చమచార్యులు తెలిపారు. రాత్రి చిన్న రథసేవ, దోపోత్సవం కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు తెలిపారు.

కోడ్ ముగిసినా.. ముసుగు తొలగలే!

రేగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా.. దేశ నాయకుల విగ్రహాలపై వేసిన ముసుగులు తొలగడం లేదు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి ఫలితాలు కూడా వెల్లడించారు. అయినా మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహంపై వేసిన ముసుగును నేటికీ అధికారులు తొలగించలేదు.



ఇందిరాగాంధీ విగ్రహానికి తీయని ముసుగు

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలి

న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణ బాబు

రేగొండ: ఉచిత న్యాయ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణ బాబు అన్నారు. బుధవారం ఆయన జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిలతో కలిసి కోటంచ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో స్టాల్ ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు రూ.3లక్షల లోపు ఆదాయం కలిగిన వారు, బాలురు, బాలికలు, మహిళల అక్రమ రవాణా, భూకంపాలు, విపత్తులు సంభవించినప్పుడు ఏ విధమైన న్యాయ సహాయం కావాలన్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు సందీప్ కుమార్, షాఖాన్, ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్లు శ్రీనివాస్, రమేష్, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణబాబు

సింగరేణి జీఎంకు అధికారుల సంఘం వినతి

భూపాలపల్లి అర్బన్: బయటి వ్యక్తులను సింగరేణి సంస్థలో విభాగ అధిపతులుగా నియమించడాన్ని నిరసిస్తూ సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధికారుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎఫ్‌లోకి వెళ్లిన సింగరేణిని సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమష్టి కృషితో లాభాల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. 30 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన సంస్థ ఉద్యోగులను కాదని కొత్త పద్ధతిలో బయటి వ్యక్తులను నియమించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరామిరెడ్డి, జాకిర్‌హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ఐదుగురిపై కేసు నమోదు

కాటారం: మహాముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ, సుంకం చెల్లించని మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం సంయుక్త దాడులు నిర్వహించారు. కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంతోపాటు కనుకునూరు, సింగంపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో సుంకం చెల్లించని మద్యం(నాన్ డ్యూటీ పేయిడ్ లిక్కర్), అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగాచారి ఆధ్వర్యంలో దాడులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా 9.375 లీటర్ల సుంకం చెల్లించని మద్యం, 21.96 లీటర్ల అక్రమంగా నిల్వ చేసిన మద్యం, 22.1 లీటర్ల బీర్లు గుర్తించి స్వాధీనపర్చుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు. వీటి విలువ సుమారు రూ.34,590 ఉంటుందని, ఐదుగురిపై కేసులు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రజిత, చంద్రశేఖర్, ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ రాంచందర్, శ్రీకాంత్, బాలు, హరిబాబు, వెంకట్ రాజు, కోటేష్, శివకుమార్, రమణ, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు



క్లుప్తంగా

విద్యాసంస్థలు, పరిశ్రమల కలయికతోనే నూతన ఆవిష్కరణలు

- సైయంట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీ.మోహన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ బీవీ.మోహన్‌రెడ్డి

కాజీపేట అర్బన్ : విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేసిన తరుణంలోనే నూతన ఆవిష్కరణలకు నాంది పలకవచ్చని సైయంట్ కంపెనీ వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీ.మోహన్‌రెడ్డి తెలిపారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీ–అకాడమీ ఇన్నోవేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు కంప్యూటర్ జ్ఞానం, కమ్యూనికేషన్, సెన్సార్లు, డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా 47 సంస్థలకు చెందిన 80 వివిధ పరిశ్రమల నిపుణులు ఆవిష్కరించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్లు శిరీష్ సోనావానే, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2లో మహిళా విభాగంలో సాయిచందనకు 9వ ర్యాంకు



సాయిచందన

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌కు చెందిన మిల్కూరి రవీందర్, అరుణ దంపతుల కూతురు సాయిచందన ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో మహిళా విభాగంలో 9వ ర్యాంకు సాధించింది. 386.11 మార్కులు సాధించిన సాయిచందన జనరల్ కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో 162వ ర్యాంకు సాధించింది. ఇప్పటికే కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న సాయిచందన కుటుంబం ప్రస్తుతం కాజీపేటలో నివాసం ఉంటోంది. కాగా, సాయిచందన గ్రూప్–1లో కూడా 453 మార్కులు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

వరంగల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గత నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్, జీటీఏ జిల్లా అధ్యక్షులు యూ.అశోక్, టి.ప్రకాశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలు గడిచినా రెమ్యునరేషన్ చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ వరంగల్ కాశిబుగ్గలోని కార్పొరేషన్ సర్కిల్ కార్యాలయం ఎదుట బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. నిరసన ప్రదర్శనలో బాలవద్దిరాజు, కే.ఉమేశ్, హరిప్రసాద్, కృష్ణమూర్తి, అశోక్, సునీల్‌కుమార్, సిద్దేశ్వర్, జోసెఫ్, శ్రీధర్, శ్రీవాణి, జ్యోతి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



ఎరుపెక్కుతున్న ఏనుమాముల..

వరంగల్ మార్కెట్‌కు పెద్దఎత్తున తరలొస్తున్న మిర్చి



ఈనెల 10వ తేదీన వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

- సోమవారం నాటికి 12,64,243 బస్తాల్లో 5,05,005 క్వింటాళ్ల రాక
- ఖమ్మం మార్కెట్‌కు తరలిన 'తేజ' రకం?
- ఈ సీజన్ చివరి నాటికి 12 లక్షల క్వింటాళ్ల మిర్చి వస్తుందని అధికారుల అంచనా

వరంగల్: ఆసియా ఖండంలోనే అతిపెద్దయిన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం పెద్ద ఎత్తున తరలివస్తోంది. తెలంగాణే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తున్న మిర్చి పంటతో మార్కెట్ ఎరుపెక్కుతోంది. మిర్చి సీజన్ డిసెంబర్‌లో ప్రారంభం కాగా ఫిబ్రవరి నుంచి ఊపు అందుకుంది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన (మంగళవారం) సుమారు 85వేల బస్తాల వరకు వచ్చినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. మార్చి 10వ తేదీ నాటికి 12,64, 243 బస్తాల్లో 5,05,005 క్వింటాళ్లు వచ్చింది. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341, డీడీ, దీపిక, దేశీ, సింగిల్ పట్టీ, 1048, తాలు, ఎల్లో మిర్చితో పాటు సుమారు 20 రకాల పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులు వరంగల్ మార్కెట్ పరిధిలో ఉన్నారు. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రైతులు వరంగల్ మార్కెట్‌కు తమ పంటను తీసుకొస్తారు. వరంగల్ మార్కెట్ పరిధిలో 25 కోల్డ్‌స్టోరేజీలు ఉండగా ఈఏడాది మరో రెండు అందుబాటులోకి వచ్చాయి. ఈకోల్డ్‌స్టోరేజీల్లో సుమారు 26 లక్షల బస్తాలు నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. గిట్టుబాటు ధరలు లభించని పక్షంలో మార్కెట్ తీసుకొచ్చిన మిర్చిని ఈ కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునే సౌకర్యం ఉంది. దీంతో రైతులు వరంగల్ మార్కెట్‌కు అన్నిరకాల మిర్చి పంటను తరలిస్తారు. కాగా, సీజన్ చివరి నాటికి మార్కెట్‌కు 12 లక్షల క్వింటాళ్లు మిర్చి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సీజన్ చివరి నాటికి మార్కెట్‌కు మరింత సరుకు



రైతులు మిర్చి సాగు చేసినా తెగుళ్లు, ఇతర కారణాలతో పలు ప్రాంతాల్లో పంట దిగుబడులు తగ్గాయి. ఈ కారణంతోనే మార్కెట్‌కు గతేడాది కంటే కొంత వరకు తక్కువ వచ్చింది. సీజన్ చివరి నాటికి మార్కెట్‌కు గతేడాది వచ్చినంత సరుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

–గుగులోత్ రెడ్డి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి, వరంగల్

	2022-23		2023-24		2024-25	
	బస్తాలు	క్వింటాళ్లు	బస్తాలు	క్వింటాళ్లు	బస్తాలు	క్వింటాళ్లు
డిసెంబర్	19,265	7,704	55,882	22,422	1,23,463	48,671
జనవరి	1,32,564	53,025	3,07,439	1,24,163	2,28,293	91,341
ఫిబ్రవరి	6,23,169	2,49,267	6,71,920	2,68,769	5,79,553	2,31,819

ఇక్కడి వ్యాపారులకు విక్రయిస్తే అప్పు కింద తీసుకుంటారని ఖమ్మంలో అమ్మకం..

రెండేళ్ల గణాంకాలను పరిశీలిస్తే 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకు వరంగల్ మార్కెట్‌కు మిర్చి తక్కువ వచ్చినట్లు చెప్పొచ్చు. దీనిపై మార్కెట్ వర్గాలను ప్రశ్నిస్తే 'తేజ'రకం మిర్చి ఖమ్మం జిల్లాకు తరలించి విక్రయించినట్లు చెబుతున్నారు. ఏ మిర్చి సీజన్ చూసినా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజ రకం మిర్చిని మాత్రమే అక్కడి వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అందుకే వరంగల్ మార్కెట్ కంటే క్వింటాల్‌కు కొంచెం ఎక్కువ ధరలు పలుకుతాయి. ఈ నేపథ్యంలో రైతులు తేజ రకం మిర్చిని అక్కడికి తీసుకెళ్లి అమ్మినట్లు మార్కెట్ వ్యాపారులు, అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడి వ్యాపారులకు విక్రయిస్తే మొత్తం డబ్బులు వారే అప్పు కింద మినహాయించుకుంటారని భావించిన కొంతమంది రైతులు ఖమ్మంలో తేజ రకం మిర్చిని అమ్ముకున్నారనే ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద సరుకు గతేడాది కంటే తక్కువ వచ్చిన నేపథ్యంలో మిర్చి పంట ఖమ్మం తరలిందా.. జోరో అయ్యిందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మానవ మేధస్సుతోనే అద్భుతాలు

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: మానవమేధస్సుతోనే అద్భుతాలు సృష్టించగలమని, కృత్రిమ మేధాను ఒక టూల్‌గా వినియోగించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్ మెంట్ కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'న్యూ హోరిజన్స్ ఇన్‌కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డ్యూరింగ్ 21 ఫస్ట్ సెంచరీ చాలెంజెస్ అండ్ ఆపార్చునిటీస్' అనే అంశంపై వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మార్పు సహజమని, అయితే టెక్నాలజీలో వస్తున్న మార్పులు వినియోగదారుడికి లాభకారిగా ఉండాలేగాని మోసగించేలా ఉండొద్దన్నారు. ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఘన్‌శ్యాంసోలంకి మాట్లాడుతూ వినియోగదారుడు టెక్నాలజీ వినియోగంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏపీలోని గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ కామర్స్ విభాగం డీన్ కె. శివరామ్ మాట్లాడుతూ కృత్రిమ మేధా నేపథ్యంలో వ్యాపార వ్యవహారాల్లో విపరీత పరిణామాలు చోటు చేసుకుంటాయన్నారు. ఓయూ రిజిస్ట్రార్ జి. నరేశ్‌రెడ్డి, ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు వి. అప్పారావు, వరంగల్ జెన్‌పాక్ట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రమేశ్, ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజయ్ బయ్యాని, సెమినార్ డైరెక్టర్ అమరవేణి మాట్లాడారు. ఈ సదస్సులో కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, సీడీసీ డీన్ పి.వరలక్ష్మి, ఎస్. నర్సింహాచారి, సదస్సు కన్వీనర్ ఫణీంద్ర, కోకన్వీనర్ బి. ప్రగతి తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో 70 పరిశోధన పత్రాల సమర్పించబోతున్నారు. నేటి సాయంత్రం ఈ సదస్సు ముగియనుంది.

బైక్‌ను తప్పించబోయి.. ట్రాలీ ఆటో బోల్తా

- 22 మందికి గాయాలు
- నడికూడ మండల కేంద్రంలో ఘటన



క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

నడికూడ/కమలాపూర్ : కూలీలను తరలిస్తున్న ఓ ట్రాలీ ఆటో..ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో 22 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఐదుగురికి తీవ్రంగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బుధవారం హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పరకాల ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన 38 మంది పరకాల మండలం మల్లక్కపేటలో కూలీకి వెళ్లారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ట్రాలీ ఆటోలో తిరిగి స్వగ్రామం బయలుదేదారు. ఈ క్రమంలో నడికూడ మండల కేంద్రం శివారులోని పెట్రోల్ పంపు వద్ద ఇదే మండలం చర్లపల్లికి చెందిన రావుల కొమురుమల్లు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై ట్రాలీ ఆటోకు అడ్డు రావడంతో డ్రైవర్ అతడిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న 22 మంది కూలీలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులందరినీ 108లో కమలాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన ఐదుగురితో పాటు స్వల్ప గాయాలైన 10 మందిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

'సుగంధ శ్రీ' ని వినియోగించుకోవాలి

- సుగంధ ద్రవ్యాల సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ట



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సుగంధ ద్రవ్యాల సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ట

మామునూరు: రైతులు 'సుగంధ శ్రీ' పథకాన్ని వినియోగించుకోవాలని ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ విజిష్ట సూచించారు. ఖిలావరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే కోఆర్డినేటర్ రాజన్న ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాల సంస్థ వరంగల్ సౌజన్యంతో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 1.67 లక్షల ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల సాగు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగు విస్తీర్ణం, అలాగే నాణ్యత ప్రమాణాలను పెంచాలన్నారు. మిరప, పసుపు, అల్లం వంటి పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సుగంధద్రవ్యాల సంస్థ రూపొందించిన బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు రాజు, వేణుగోపాల్, ఉద్యాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై బయోటెక్నాలజీ ప్రభావం

- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం



మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : మానవుడి మానసిక ఆరోగ్యంపై బయోటెక్నాలజీ ప్రభావం ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. కేయూలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ ముగింపు సభలో రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సైకాలజీ, ఇమ్యూనాలజీ కలిసి పనిచేస్తేనే మానసికంగా ధైర్యంగా ఉండే వ్యక్తుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మానసిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారన్నారు. బయోటెక్నాలజీ ద్వారా అభివృద్ధి చేస్తున్న కొత్త ఔషధాలు, థెరపీలు,డిప్రెషన్ యాంగ్జైటీ, న్యూరోడిజెనరేటివ్ వ్యాధుల (పార్కిన్సన్,అల్జీమర్స్) చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయన్నారు. జన్యు ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్ ద్వారా వ్యక్తిగత ఆరోగ్య డేటా అందుబాటులోకి రావడం ప్రైవసీ ఎథికల్ (నైతిక) సమస్యలకు దారితీస్తుందన్నారు. ఇది వ్యక్తుల మానసిక స్థితిపై ఎలా ప్రభావం చూపుతుందనే అంశంపై సమగ్రపరిశోధనలను సమాజ అభివృద్ధికి, మానవ ఆరోగ్యపెంపునకు ఉపయోగపడేలా అన్వయించాలన్నారు. నూతన ఆవిష్కరణల కోసం శాస్త్రవేత్తలు, సైకాలజిస్టులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. వెంకయ్య, హైదరాబాద్ ఎన్ఐఎన్ ప్రొఫెసర్ రాజేందర్, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, దూర విద్య కేంద్రం డైరెక్టర్ బి. సురేశ్‌లాల్, జువాలజీ విభాగం అధిపతి జి. షమిత, ప్రొఫెసర్లు ఈసం నారాయణ, మామిడాల ఇస్తారి పాల్గొన్నారు. వందకుపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు.

మావోయిస్టు కొరియర్లు, మిలీషియా సభ్యుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



మావోయిస్టు కొరియర్లు, మిలీషియా సభ్యుల అరెస్ట్ చూపుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం : సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు కొరియర్లు, ఇద్దరు మిలీషియా సభ్యులను అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో వారి అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. వాజేడు పోలీసులు వాజేడు మండలం మురుమురు గ్రామం వద్ద ఈనెల 11వ తేదీన సాయంత్రం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా పేలుడు సామగ్రి, కార్డెక్స్ వైర్, డిటోనేటర్స్, టిఫిన్ బాక్స్, బ్యాటరీలు, కొంత మెడిసిన్‌తోపాటు కొన్ని వస్తువులు లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అదుపులోకి తీసుకుని విచారించారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన ఇల్లందుల విజయ్, తీగారం గ్రామానికి చెందిన ఈరెల్లి నాగరాజు సీపీఐ మావోయిస్టు పార్టీ కొరియర్లుగా, ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం పామునూరు గ్రామం బర్లగూడెం పంచాయతీకి చెందిన మడివి పాండు, మడవి భీమా మిలీషియా సభ్యులుగా పని చేస్తున్నారు. వీరు మావోయిస్టులకు నిత్యావసర వస్తువులు, ఐఈడీల తయారీలో ఉపయోగించే పేలుడు సామగ్రిని అందించే వారు. ఎప్పటికప్పుడు పోలీసుల కదలికలను పార్టీకి చేరవేసే వారు. ఈ నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. కార్యక్రమంలో వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు, వెంకటాపురం ఎస్సైలు రాజ్‌కుమార్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే



జడ్జి క్షమాదేశ్‌పాండెను సన్మానిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండె అన్నారు. బుధవారం హనుమకొండలోని సుబేదారి యూనివర్సిటీ 'లా' కళాశాలలో సెమినార్‌హాల్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు.. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు అవకాశాలు వస్తే పురుషులకు తీసిపోకుండా సమానంగా ఎదుగుతారన్నారు. మహిళలు న్యాయం రంగంలోనూ ప్రతిభ చాటాలన్నారు. అనంతరం ఆ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడారు. న్యాయకళాశాల అధ్యాపకులు ఎడ్ల ప్రభాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. క్షమాదేశ్‌పాండెను సన్మానించారు.

భద్రకాళీనగర్‌లో చోరీ

- 26 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష నగదు మాయం



సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న దుండగుడు

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురం భద్రకాళీనగర్‌లో చోరీ జరిగింది. దుండగులు రెండిళ్లలో సుమారు 26 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష నగదుతో పాటు తొమ్మిది లక్షల విలువైన బాండ్లు ఎత్తుకెళ్లారు. ఈ రెండు చోరీలు ఒకే కాలనీలో జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. భద్రకాళీనగర్‌కాలనీకి చెందిన పాతి ధర్మయ్య, స్రవంతి దంపతులు ప్రభుత్వ అధ్యాపకులు. ధర్మయ్య ఖమ్మంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, స్రవంతి ఐనవోలులోని కస్తూర్బాలో విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం ధర్మయ్య ఖమ్మం, స్రవంతి ఐనవోలు వెళ్లారు. అరోజు రాత్రి ఖమ్మంలో జరిగిన బంధువుల పెళ్లికి ధర్మయ్య హాజరయ్యాడు. ఇంటర్ పరీక్ష ఉండడంతో స్రవంతి ఐనవోలులోనే ఉంది. బుధవారం ఉదయం ఇద్దరూ ఇంటికి వచ్చారు. తలుపు తాళాలు ధ్వంసమై కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న సుమారు 20 తులాల బంగారం, రూ.లక్ష నగదుతోపాటు తొమ్మిది లక్షల రూపాయల విలువైన బాండ్ల మాయమయ్యాయి. అలాగే, అదే కాలనీకి చెందిన ఆకుల వెంకటేశ్వర్ల ఇంటిలో కూడా చోరీ జరిగింది. ఆరుతులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. నాలుగు నెలల క్రితం వెంకటేశ్వర్లు దంపతులు అమెరికాకు వెళ్లారు. విషయం తెలియగానే హైదరాబాద్‌లో ఉంటున్న వెంకటేశ్వర్ల కూతురు హుటాహుటిన గోపాలపురానికి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకుని సీసీ ఫుటేజీ పరిశీలించారు అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు.

కనుల పండువగా ఫాతిమామాత ఊరేగింపు..

- కేథిడ్రల్ చర్చి నుంచి సాగిన మహా రథప్రదక్షిణ
- ప్రదక్షిణలో సందేశమిచ్చిన బిషప్ ఉడుముల బాల



ఫాతిమామాత ఊరేగింపులో ఉడుముల బాల

కాజీపేట రూరల్ : ఫాతిమామాత తిరునాళ్ల మహోత్సవంలో రెండో రోజు బుధవారం ఫాతిమామాత స్వరూపంతో మహా రథప్రదక్షిణ ఊరేగింపు కనుల పండువగా జరిగింది. ఫాతిమాకేథిడ్రల్ ప్రాంగణంలో బుధవారం రాత్రి ఓరుగల్లు పీఠకాపరి, విశాఖ అగ్రపీఠకాపరి బిషప్ ఉడుముల బాల ఫాతిమామాత స్వరూపం 24 ఫీట్ల రథయాత్రకు ప్రత్యేక ప్రార్థన , దూపం వేసి ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం చర్చి ప్రాంగణం నుంచి ఫాతిమా మెయిన్ రోడ్, దర్గా వీధుల గుండా ఊరేగింపు కొనసాగిస్తూ తిరిగి చర్చి ప్రాంగణం వరకు సాగింది. ఇక్కడ బిషప్ ఉడుములబాల దివ్య ప్రసాద ఆశీర్వాదంతో ఊరేగింపు ముగిసింది. చర్చి ప్రాంగణంలో భక్తుల కొవ్వొత్తుల ప్రదర్శనతో ఫాతిమామాతను వేడుకున్నారు. ఈ సందర్భంగా బిషప్ ఉడుముల బాల సందేశమిస్తూ ప్రజలందరిపై ఫాతిమామాత దీవెనలు, ఆశీర్వాదాలు ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. కర్నూల్ పీఠం ఫాదర్ జెరువా జోజిరెడ్డి దివ్యబలిపూజను సమర్పించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఫాదర్ కాసు మర్రెడ్డి, కె.జెసెఫ్, టి.జోసెఫ్, జి.అనుకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమామాతకు భక్తుల ప్రార్థనలు..

ఫాతిమామాత గుహ వద్ద తిరునాళ్ల మహోత్సవానికి తరలి వచ్చిన భక్తులు ప్రార్థనలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి, కానుకలు వేసి తమ కోర్కెలు కోరుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఫాతిమా నగర్ ప్రాంతం ఎటు చూసిన సందడిగా మారింది.



తిరునాళ్ల మహోత్సవంలో భక్తులు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- సాలార్ తండా వద్ద ఘటన



సంపత్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్ తండా వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కురవి మండలం సూదనపల్లికి చెందిన బొల్లెబోయిన సంపత్ (26) జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన సంపత్.. సాయంత్రం తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా సాలార్ తండా వద్ద రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సంపత్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, సంపత్ తండా వద్ద రోడ్డుపై పశువు అడ్డంరాగా దానిని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి పడిపోయి తీవ్రగాయాల పాలయ్యాడని కొందరు పేర్కొనగా.. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే మృతి చెందాడని ఆరోపించారు. ఘటనా స్థలిని టౌన్ సీఐ దేవేందర్, టౌన్ ఎస్సైలు విజయకుమార్, అలీమ్ హుస్సేన్ సందర్శించారు. మృతుడికి భార్య అఖిల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

AIRTEL XSTREAM

■ ఇంటర్నెట్ 40 mbps Unlimited Data + టీవీ చానెల్స్ HD + 20 OTT. డిష్ ఆంటీనా లేకుండా. పల్లె, పట్టణాలలో కూడా. Rs. 2,499/- 3 నెలలు. సెల్: 9989498387. [W-1265065]

SOLAR ENERGIES

■ Orugallu Solar Energies: We provide all Solar Installations House, Commercial purpose with Subsidy. Marketing Persons wanted. G20, KRMS Reddy Complex, Hanumakonda. Cont: Mendu Raghu - 9059700497. [W-1265062]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. D.S.Rao. Cell: 9849145043. [SCA25002056]

WANTED

■ OT - Technicians (Exp), Pharmacy (Exp), Lab-Technicians (Exp), Dhobi Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X'Road, WGL. 12 to 2pm. [WA-490]

■ మహాలక్ష్మి మోటార్స్: వరంగల్, మహ-బాద్, సిద్దిపేట, తొర్రూర్, జనగాం బ్రాంచ్‌లలో పని చేయుటకు ఆటోమొబైల్ రంగంలో అనుభవం కలిగిన టీం లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్ కావలెను Cont: 9000911082, 9000904838 [W-1264092]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002107]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.